ప్రచురణకు స్వీకరించిన పోటీ కథానిక :

# ★ నిష్కృతి ★

రచన: తటవర్తి

"ఓహో! మఱదిగారా! ఈమధ్య దర్శనాలు లేవేం?..." విమల సుస్వాగత మధురహాసం నామానసికగ్లాని కొక మలయమారుత సవ్పర్శ అయింది!

"యంగ్ లాయర్ కదుటోయ్! అంద చందాలు, బుద్ధి చాతుర్యాలు దేవుడిచ్చాడు. అదృష్టాన్ని మెడపట్టి లాక్కొ తెచ్చుకున్నాడు... ప్రాక్టీసు పెరుగుతోంది, తీరిక తరుగుతోంది... అందులో—నీబోటి పిల్లవరయినా దారి కడ్డుపడివుండవచ్చు... మరి దర్శనాలు వెనకటిలా ఎట్లావుంటాయి చెప్పు—ఎట్లావుందోయ్?..." రామం పరిహాసంలోనే వాత్సల్యం స్పష్టమవుతోంది.

"నీ మొహంలా వుంది..." అన్నాను విసుగ్గా.

"నా మొహాని కేమిటోయ్!...నిక్షేపంలా వుందని మీవదిన సర్టిఫైచేసి యిప్పుడేగా ముద్దెట్టుకోబోతుంటే పానకంలో పుడకలా నువ్వు వచ్చిపడ్డావ్!...."

"ఛీ! సిగ్గులేకుండా ఏమిటా మాటలు?..." విమల చిరుకోపంలోకూడ భర్తపై అనురాగం ముచ్చట గొల్పింది మరొకప్పుడైతే ఆ భార్యాభర్తల పరిహాసాల్లో నేనూ పాత్ర వహించి ఏకధాటిని గంటనో నిమిషంలా గడిపేసేవాడిని. కాని, ఆయింట్లో అడుగిడటానికి ముందుండే నా మానసిక పరిస్థితి నాకా ఉత్సాహాన్ని ప్రసాదించలేదు.

"నాకెందుకు సిగ్గు? ఆడదాన్ని కాదుగా! ఛీ అని తీసి పారేసినంతమాత్రాన యీ మొగుడంటే యీ పిల్లకి కించిత్తయినా లక్ష్యంలేదని ఇంకా ఇంకా ఎన్నో అనుకోటానికి గిరి ఎవడో దారినిపోయే దానయ్య కాదోయ్! నీ మొగుడికి బాల్యస్నేహితుడు — ఫేమిలీ లాయరు వరసకి తమ్ముడూను..."

"ఊఁ! మీ కూడికలు తీసివేతలు తర్వాత చూసుకోవచ్చు కాని...వేళాకోళానికి వేళాపాళ లేకుండ మీ కబుర్లు మీవేనా—అతని మంచిచెడ్డల్ని విచారించటం ఏమన్నా వుందా?..." విమల నాముఖభావాలు చదవటం ఆనందం, సిగ్గుకూడ కల్గించాయి నాకు.

"ప్రేలిందిరాబాబు ఆటంబాంబు!..." అని ఇంకా పరిహాసాని కేదో అనబోతున్న రామం నావైపుచూసి ఆగిపోయాడు.

నేను టీపాయ్‌వైపు చూస్తూ మౌనంగా ఉండిపోయాను. ఏం మాట్లాడాలో తోచలేదు...

"అట్లా వున్నావేరా! రెండురోజులూ క్లబ్బులోకూడ కనిపించటంలేదని నిన్న మీ యింటికి వెడితే నువ్వు మీ అక్కయ్యని తీసుకురావటానికి వెళ్ళావని మీ నాన్నగారు చెప్పారు... ఇంతకీ తీసువచ్చావా?" రామం మాటల్లోని సందేహాలు నాఅహాన్ని గేలిచేసినట్లనిపించింది.

నేను మాట్లాడలేదు. తెలియని కోపం లోపల రగులుతోంది. ఏదో కసి...

"బెల్లంకొట్టే రాయిలా మాట్లాడవేరా?..."

"మీ యింజనీరు బుర్రకి ఎప్పుడు పరిహాసమాడాలో కూడ తోచదేంఖర్మ! ఫలితమేమిటో అతని ముఖంచూస్తే తెలియటంలా?.. ఇట్లా ఎన్నిసార్లు కాలేదు?" ఆమె మాటలు నా కోపాగ్నిలో ఆజ్యం పోసాయి.

ఓ నిమిషం మామధ్య మౌనం...

"మీనాన్నగారి చాదస్తంకాని ఆమె ఇక వస్తుందని నాకు నమ్మకంలేదు..."

"అబ్బ! మీరూరుకోండురూ! ... అక్క—బావ—పిల్లలు అంతా కులాసాగా వున్నారా?"

విమల చాల సహజంగా అడిగినా నామనస్సు సమాధాన పడలేదు.

"ఎందుకోదినా నన్నట్లా దెప్పుతావు?..." అప్రియత్నంగానే అన్నాను.

విమల ముఖం చిన్నబోయింది. "నన్నపార్థంచేసుకోకు గిరీ! చూసి వచ్చావుకదా... వాళ్ళ ఆరోగ్యం విషయం తెలుసుకోవాలన్న ఆత్రుత నాకుండదా?"

"నువ్వు వచ్చేవరకు మళ్ళీ నీగుమ్మమెక్కనని కరారుగా చెప్పివచ్చాను—ప్రాణం విసిగిపోతోంది నాకు." అన్నాను ఉసూరుమంటూ.

"వదినా మఱదుల వాగ్వివాదాలు వినే ఓపిక కావాలంటే సిగరెట్లు కావాలి. అట్లాపోయి కిళ్ళీపాపువాడిని పావనంచేసివస్తాను.." అంటూనే మాముఖాల వైపొకసారి నిష్క్రమించారు రామం.

మా యిద్దరిమధ్య కొన్నిక్షణాలు మౌనం గజ్జెకట్టింది. సోఫాకమ్మీమీద చూపుడు వ్రేలితో ఏవో పిచ్చిగీతలు గీస్తూ వుండిపోయాను. విమలముఖం చూసే ధైర్యం కలుగలేదు నాలో...

"...దీనిగురించి నీవు తల పగలిపోయే ఆలోచనతో మతిపోగొట్టుకోని ప్రయోజనం లేదు. గిరీ! అక్కయ్య కష్టపడుతోంది... ఆమె జీవితాన్ని అత్యున్నత స్థాయికి తీసుకురావాలి. దానికోసం విశ్వప్రయత్నాలన్నీ చేసి ఎట్లాగయినా సాధించాలి — అన్నది నీపట్టుదల. నీ ఆశయం మంచిదికాదని ఎవరూ అనరు. అక్కసుఖంకోసం తన సర్వస్వం ధారపోసే ఏ తమ్ముడినయినా లోకం హర్షిస్తుంది. కాని, నీకా అవకాశంలేదని బాధపడి చేయగల్గిందేమీలేదు. సుశీలతో నాకు కొద్దిక్షణాల పరిచయమైనా ఆమె తత్వాన్నిట్టే అర్థం చేసుకోగలిగాను. ప్రేమ, ఓర్పుమాత్రమే కాదు విజ్ఞానవివేకాలుకూడ ఆమెలో మూర్తీభవించి వున్నాయి...అటువంటివ్యక్తి ప్రస్తుత జీవితం ఎంత బాధాజనకమైనా—నీ వూహించినట్లు భర్తను వదలి రాలేదు. నీవు చూపే ఆదరణకే తృప్తిచెంది సుఖిస్తుందనుకోవటం నీభ్రమ...."

నాకు కోపం నషాళానికంటింది. "...అవును స్వార్థమే మరి! ఇద్దరిపిల్లల తండ్రియికూడ బాధ్యతలేకుండ ఇళ్లు ఒళ్లు గుల్లచేసుకుంటూ— రోగంతో తీసుకుంటున్న భార్యాబిడ్డలు బ్రతికారో చచ్చారోకూడ తన కవసరంలేని ఆ ప్రబుద్ధుడివద్ద లభించే సుఖం, అదే రక్తం పంచుకుపుట్టి ఆమె సౌఖ్యంకోసం అనుక్షణం పరితపించే తమ్ముడివద్ద ఎట్లా లభిస్తుంది? ఇదేనా వదినా—నువ్వు చెప్పేది?"

విమల గాఢంగా నిట్టూర్చి చిన్నగా నవ్వింది "నామాటలు అర్థం చేసుకోటానికి నీకోపం అడ్డువస్తోంది. సరే నీవాదన పూర్తికానీ!"

"లాయర్ని వాదింటంలేదు నేను. తనని పురుగుకంటె నీచంగాచూసే ఆ అధముడే తన సర్వస్వమంటుందేమిటి? రెండుసంవత్సరాలుగా పుట్టింట్లోనే దృష్టిపడనంతటిదిగా వుందా యిప్పటి జీవితం?—"

"భార్యా భర్తలమధ్య వుండే రాగబంధం అటువంటిది! నీకిప్పుడు చెప్పినా అర్థంకాదు. మానాన్న వ్రాయగా వ్రాయగా ఏ ఆరునెలలకో ఓసారి వెళ్ళటం బ్రహ్మాండం — అప్పటికీ వారిని వదలి వెళ్లాలనిపించదు నాకు—"

"ఎందుకబద్ధాలాడతావ్! పుట్టింటికి పంపుతావా, లేచిపోనా—అని కదుటోయి నిన్న రాత్రి నువ్వు అలకపాన్పు ఎక్కినదీ?—" అంటూ సిగరెట్టు ఆఖరిదమ్ము పీల్చి అవతల పారేసి లోపలికి వచ్చాడు రామం.

"ఏమిటి మరీను చిల్లపిల్లా డీలా—" అని కసురుకుంది విమల.

వాదనపై నేవుంది నాదృష్టి. "మీ దాంపత్యంతో పోల్చి చేస్తావేమిటి వదినా! ఆర్థికంగాను, నైతికంగాను కూడ మీది సుఖజీవితం. ఏకమనస్కులై మసిలే మీరిద్దరూ ఒకర్నొకరు విడిచి కొన్నిరోజులుండటాని కిష్టపడటం లేదంటే ఆశ్చర్యపోనక్కర్లేదు. అనుకూల దాంపత్యానికది సహజం— వాంఛనీయంకూడ! కాని, మాఅక్కయ్య ప్రవర్తనే నాకు విచిత్రంగావుంది. తను గ్రాడ్యుయేటు— సంగీత సరస్వతి— విజ్ఞానవివేకాలతో ఓ వ్యక్తిత్వం సంపాదించుకుంది. అటువంటి ఏరికోరి చేసుకున్న వాడు బాధ్యతారహితంగా, నీచంగా— రాక్షసునిలా ప్రవర్తిస్తుంటే తన వ్యక్తిత్వాన్ని బలిపెట్టుకొని బానిసలా పడివుంటాననటం దేమిటి? ఏదో బలహీనతకి లొంగిపోయి అట్లా వ్యసనాలు పాలయ్యాడనుకుందాము. అట్లాగనే ఏదో ఒకనాటికి తన్ను తాను తెలుసుకుంటాడని ఇంతవరకు నిరీక్షించాము. ప్రపంచంలో ఎన్నో మార్పులు వచ్చాయి కాని, అతనిలో మార్పురాలేదు. యీ రెండు సంవత్సరాలలోను కళ్లల్లో ప్రాణాలు పెట్టుకొని యీసురోమంటూ, తానట్లాగే కుళ్ళి కృశించటానికయినా ఒప్పుకుంటుంది కాని, యిక్కడ అమ్మ నాన్న ఆమె రాకకోసం తపస్సు చేస్తున్నారని ఎంతచెప్పినా వినదు. పైగా తను స్వర్గంతో సమానమైన జీవితం అనుభవిస్తోందని— తానందువల్లనే ఆ ప్రబుద్ధుని వదలి రాలేకపోతోందని నన్ను అమ్మకి, నాన్నకి చెప్పమంటుంది—ఉత్తరాలలోకూడ కల్పించి తానెంతో సౌఖ్యమనుభవిస్తున్నట్లు వ్రాస్తుంది. నన్నింటివద్ద చెప్పనీయకుండ లెంపైవొట్టేసుకొని నానోరు కట్టేసింది. నేను ప్రతిసారి వెళ్లి రావటం యిక్కడ వీళ్ళ సంతృప్తికోసం కల్పించి చెప్పటం పరిపాటయిపోయింది— ఎన్నాళ్ళని యీ అంపవుకోత భరించను? ఒకరికి న్యాయం చేద్దామంటే వాగికి వారే అన్యాయం చేసుకుంటుంటే ఎట్లా సమస్య పరిష్కారమయ్యేది?—"

"అయితే, అక్కయ్య నీమాట పాటించటమే న్యాయమంటావా?" విమల ప్రశ్న నాకు చిరాకనిపించింది.

"ఎన్నిసార్లు చెప్పినా నువ్వూ అక్కయ్యనే వెనకేసుకువస్తున్నావు! అసలు మీ స్త్రీజాతిలోనే వుందేమో యీదుర్గుణం! మీ బానిసత్వాన్ని మీరే కొనితెచ్చుకుంటుంటే సమానత్వాని కెంతమంది ప్రయత్నించినేమాత్రం ప్రయోజనమేముంది?..."

విమల చిన్నగా నవ్వింది. చిన్నప్పటి నుండీ శరీరంలో భాగంలా అక్కయ్యతో పెరిగిన నాకు ఆమె మనస్సు అర్థంకానట్లుండటం సరికదా, పట్టుమని రెండుసార్లయినా ఆమెతో మాట్లాడని విమల అన్నీ తెలిసినట్లుగా మాట్లాడటం నాకు ఆశ్చర్యం, అసహనం కూడ కల్గిస్తోంది.

"భర్తవద్ద లభించిన సుఖం మరోచోట లభిస్తుందనుకునే స్త్రీకి ఓటమి మాత్రమే చివరికి మిగిలేది. నువ్వు ఉదహరించిన సమానత్వమంటే తనుకూడ తన కాళ్ళపై నిలబడి బ్రతకగలది అని అనిపించుకోవటం వరకే కాని, తన విజ్ఞాన వివేకాలతో భర్తృ హృదయాన్ని తన కనుకూలం చేసుకున్న స్త్రీకి అంతకంటె ఉత్తమ స్థానమే లభిస్తుంది. ఇక మీ అక్కయ్యలాంటి వాళ్ళకా... కాలం కలిసి రావాలి తప్ప ఎవరూ చెయ్యగల్గిందేమీలేదు. ఆ విషయం మీ అక్కకి బాగా తెలుసు. అందుకనే, ఆ మంచిరోజు కోసం నిరీక్షిస్తోంది."

'అది ఒక ఎండమావి!'

'ఎండిపోయిన చెలువుకన్న ఎండమావి మెరుగుకదూ?'

'ఆశ ఎంతోకాలం ప్రాణం పోస్తుందనుకోటం తెలివితక్కువ.'

"నిరాశ కంటె నిరీక్షణవల్ల ఎండిన మోడుకూడ చిగిర్చటానికి అవకాశముంది గిరీ! పోనీ, నీ మాటవిని సుశీల భర్తని వదలి వచ్చేసిందే అనుకుందాం... తండ్రిప్రేమ నోచుకోని ఆ పిల్లలుకూడ ఆమెతో రాకతప్పదు. సరే, మీ ఆదరాభిమానాలవల్ల పిల్లలు అభివృద్ధిలోకి వస్తారు. ఓనాటికి వాళ్లకూ లోకజ్ఞానం కల్గుతుంది. తండ్రీ ఏడీ అని పిల్లలడిగితే ఆమె ఏం చెప్పగల్గుతుంది? అప్పుడు లోకానికి— తన ధర్మానికి మధ్య నలిగిపోయే బ్రతుకుకంటె ఇప్పటి పరిస్థితి ఎన్నోరెట్లు మెరుగు కదూ? ఇక యిటు భర్తవిషయం చూస్తే— బాధ్యత వున్నప్పుడే యిట్లా విచ్చలవిడిగ సంచరిస్తున్నవాడు ఆ బాధ్యతను నీవు తొలగిస్తే మరింత బరితెగించిపోడూ? ఇప్పుడు మీ అక్కకి సుఖశాంతులు దక్కుతాయా? రెంటికీ చెడిన రేవడి బ్రతుకవదూ? పిల్లల అభివృద్ధి అంటావా - యివేళ కాకపోతే రేపయినా కడుపులో పెట్టుకొని ఆదరించటానికి నీవున్నావు. భర్తతోడిదే లోకము, స్వర్గనరకాలు రెండూ అతని సమక్షంలోనే... అనే నమ్మకాలు అనాదిగా మన భారతీయ సాంస్కృతిక - సమాజ జీవనాల్లోనే వేళ్లు పాతుకుపోయి వున్నాయి గిరీ! నాగరికత ఎన్నో రకాలుగా పేర్లుపెట్టి సంస్కరణ తీసుకురావటానికి ప్రయత్నించవచ్చుకాని రక్తంలో జీర్ణించుకు పోయిన యీ విశ్వాసాన్ని మభ్యపెట్టటం ఎవరితరం?

అసలా ప్రసక్తి తీసుకురాటమే హాస్యాస్పదం! ... అందుకనే స్త్రీ తనకోసమే కాదు—మరికొందరికోసంకూడ జీవిస్తుందన్న సత్యాన్ని ఎందరో మహానుభావులు స్పష్టం చేసారు..."

'వ్యక్తిత్వమున్న స్త్రీ ఈ బలహీనతలకి లొంగిపోదు...' నా కంఠంలో కాఠిన్యం ధ్వనించింది.

"అయితే, ప్రేమించటమే ఒక బలహీనత అనవల్సి వస్తుంది. మీ అక్కగురించి నీవు బాధపడటం కూడ..." నా జేవురించిన ముఖంచూసి విమల చిన్నగానవ్వి వూరుకుంది. ఆమె నమ్మకాలపై విశ్వాసంకంటె, ఆమె వాక్చాతుర్యంపై ఆసక్తి ఇంతవాదనకు మూల కారణమైంది. ఆమెను వాగ్వాదంలో ఓడించటంపోయి నేనే ఓడిపోయినట్లయింది.

గజిబిజిగా వున్న యీ ఆలోచనలు ఒక స్థూల దృష్టిని ప్రసాదించటంలేదు. అసలు స్త్రీయొక్క అంతర్యమే ఓ పెద్ద ప్రశ్నార్థకం—అని యిప్పుడు స్పష్టమౌతోంది. కాని, దీనికి జవాబు తెలుసుకోవాలంటే విమల వాగ్వాదం చాలదు; అక్కయ్య సహనజీవితం సర్దిచెప్ప లేదు... ఎంతయినా రక్తసంబంధం అడ్డు వస్తోంది.

అయితే ఇది శేషప్రశ్న కావల్సిందేనా? తల వేడెక్కిపోయింది నాకు...

'అధైర్యపడక మరికొన్నాళ్ళు ఓపికపట్టు గిరీ! అమ్మకి నాన్నగారికి యీ విషయం చెప్పకు ఈ పెద్ద వయస్సులో వారా అల్ప సంతృప్తితో నయినా శాంతిగా జీవించటం వాంఛనీయం. నీవుకూడ అవసరమైన ఆలోచనలతో నీ బుర్ర పాడుచేసుకోకు..." అంది విమల.

'అందుకనే ఆ మహానుభావు డెవడో అన్నాడు— ఆడదాన్ని అర్థంచేసుకోవాలని అనవసరంగా అవస్థపడకు... అమాంతంగా ప్రేమించెయ్యడమే దానికి దగ్గరిదారి—'అని... ఉన్నమాట చెప్పొద్దూ! మీ వదిన విషయంలో యీ పద్ధతి అక్షరాలా పాటించక తప్పలేదురా నాకు! మరి బ్రహ్మచారికి నీకేం తెలుస్తుంది చెప్పు!...' అన్నాడు రామం.

'అయితే, మా చెల్లాయిని రప్పించి ఆ పుణ్యం మీరే కట్టుకోండి...'

ఆ భార్యాభర్తల పరిహాసాలు గట్టుతెగిన ఏరులయ్యాయి. అప్పటికి మనస్సు నిర్లిప్తత వహించటంతో వాళ్ళతో ఇతర విషయాల మీద సరదాగా మాట్లాడగలిగాను. అక్కడ మరోగంట కాలక్షేపంచేసి యింటిముఖం పట్టాను.

దారిలో విమలతోటి సంభాషణ మననం చేసుకుంటే న్యాయశాస్త్రానికి అందనివి—నిజాలు ఎన్నో వున్నాయని మాత్రం అర్థ మయింది ఆనాడు నాలో ఉదయించిన ప్రశ్నకి ఏదో ఒకనాడు సమాధానం దొరక్క పోతుందా?— అని మనస్సుని సమాధాన పర్చు కున్నాను... కాని, ఆ అవకాశంకూడ—మరునాడే దక్కుతుందని కలలోకూడ వూహించ లేదు...

ఆవేళప్రొద్దున్న కోర్టుకి బయలుదేరబోతూ బట్టలు వేసుకుంటున్నాను

. 'ఏం రామయ్యా! అప్పారావు బట్టలు కుట్టాడా ఇంకా లేదా?... ఈ మధ్య మరీ సోమరిపోతయి పోతున్నాడు...' అని ఇంకా ఏదో అనబోతూ వాడిముఖం చూసి తెల్ల బోయాను.

'ఇంకెక్కడి అప్పారావు బాబూ! వాడి పాపం పండింది. పోలీసు లెత్తుకెళ్లారు...'

ఒక్కక్షణం తెల్లబోయాను ఎందుకని?..'

'కాంతాన్ని ఖూనీచేసి పారేసాడంట...'

. షాక్ తగిలినట్లుంది...

యోగం! బాబూ యోగం. నాలుగు డబ్బులు చేతిలో ఆడుతున్నాయని అష్టమురుగున పనులుచేస్తే ఏమవుతుంది?— చేసుకపోయి నా చేసాడనే అంటారు పోలీసోళ్ళు. కట్టుకున్న దాన్ని ఉసురుపెడితే ఏమవుతుంది?'

వరలక్ష్మి నా కళ్ళల్లో మెదిలింది. మనస్సు చివుక్కుమంది. మేడమెట్లుదిగుతూ వస్తుంటే నాన్నగారు '... విన్నావుగా గిరీ!— అప్పారావు ఇంత దారుణం చేసాడంటే నమ్మలేకుండా వున్నాను...' అన్నారు.

'యోగాన్నెవరూ తప్పించలేరు... నాకు కోర్టుకి టైమైందినాన్నా...' అని సైకిలుమీద బయలుదేరాను.

నాన్నగారేమిటి, నేనేమిటి అప్పారావు నెరిగిన వాళ్ళెవరూ అతనంతపని చేశాడంటే నమ్మలేరు. చిన్నతనంనుంచి అతను మాకు బాగా పరిచితుడు. టైలరుపని కొట్టు పెట్టు కుంటూ అందరిలోను పేరు తెచ్చుకున్నాడు. రెండేళ్ళనాడే పెళ్ళిచేసుకున్నాడు కూడా... అటువంటివాడు నాలుగు డబ్బులు చేతిలో ఆడేటంతో పేకాటంలోకి దిగాడని నాకు తెల్సింది. నాయుడి పెళ్లాం కాంతంతో సంబంధం పెట్టుకున్నాడని రామయ్య ఓ,గారి అన్నాడు. లేనిపోని చెప్పుడుమాటలు విని పాడుమాట లక్కడి వెక్కడివి చెప్పకని వాడిని కసురుకున్నాను. కాని, ఆ తర్వాత ఇద్దరు ముగ్గురు చెప్పారు ఆ విషయం నిజమే నని... ఆమెకు ధనం వుంది కాని గుణంలేదని లోకం ఎప్పుడో ... అయితే డబ్బు మస్తుగావుండే అసామంత పిస్తోల్ పరిచయమున్న నాయుడిని వేలెత్తి చూపే ధైర్యం ఎవరికీలేదు. కాంతంతో అప్పా రావు సంబంధం రకరకాల కథలుగా వూళ్లో ప్రచారం చేస్తున్నా నాయుడు చూసీ చూడ నట్టూరుకోవటం అందరితోపాటు నాకూ ఆశ్చర్యం కల్గించింది. అయినా, యిటువంటి చిన్న విషయాలపై ఆసక్తి నివ్వలేదు

ఇప్పుడు హఠాత్తుగా యీ వార్త వినేసరికి ఏదో మనస్సులో కెలికినట్లయింది ఈ మధ్య అప్పారావు విశృంఖల సంచారం మనస్సులో మెదిలి ఏదో కసితీరినట్లనిపించింది గా, వరలక్ష్మి గుర్తుకువచ్చి అసలటువ హత్యచేసాడో లేదో తెల్సుకుందామని ఇన్స్పెక్టర్ని కల్సుకున్నాను.

నాతోవున్న ముఖపరిచయంతో నేను పూర్తిగా వివరించాడు ఇన్స్పెక్టరు అప్ప రావుని నేరస్థునిగా నిరూపించటానికి ప్రాసి క్యూషన్‌కి బలమెక్కువగా వుంది. కాని, కంటికి మంటికి ఏకధారగా రోదిస్తూ తానే పాపమెరుగననే అప్పారావుని చూస్తే అతను నిర్దోషి అని అంతర్యం ఘోషిస్తోంది... అయినా, అతన్ని కాపాడటానికి కేమాత్రం అవకాశాలున్నట్లు లేవు.

ఇంతగా ఏడ్చి మొత్తుకునే హోదసలా నీచ సంబంధం ఎందుకు పెట్టుకోవాలి? చేసినకర్మ అనుభవించనీ - అన్న నిర్లిప్త భావంతో ఆ రాత్రి యింటికి చేరాను.

భోజనం చేసి మేడమీద రీసెస్‌లో విశ్రాంతి తీసుకుంటున్నాను. చవితి చంద్రుని వెన్నెల వానలో మనస్సు ఉయ్యాల లూగుతోంది. రూఫ్ గార్డెన్‌లోని మల్లెల సౌరభ్యం మత్తెక్కిస్తోంది, అనూహ్యమైన హైరణ్యమేదో అంతరంగంలో పురివిప్పుకుంటోంది.

పరిసరాలు మరిచి ఏవో ఊహాలోకాలలో తేలియాడుతున్న నేను, 'వరలక్ష్మి వచ్చింది బాబూ!' అన్న రామయ్య గొంతువిని ఉలికి పడినట్లయ్యాను.

రామయ్య లైటువేసాడు. వరలక్ష్మిని ఆపాదమస్తకం ఒకసారి పరికించాను. మూర్తీభవించిన శోకదేవతలావుంది. అకస్మాత్తుగా అక్కయ్య గుర్తుకువచ్చింది—అంతవరకు నిర్మలంగావున్న మనస్సు క్షణంలో కరిగిపోయింది.

''వాడీపని చేయలేదని, రాత్రి పొద్దోయేదాక ఇంటికాడే వున్నాడని అంటోంది బాబూ! పాపం, దానిబాధ చూస్తుంటే కడుపు తరుక్కుపోతోంది. తల్లి తప్ప ఎవ్వరూ లేరుకదా—మీరే ఓ చూపుచూసి యీ కష్టాన్ని గట్టెక్కించాలని దాని బాధ—'' అన్నాడు రామయ్య.

స్త్రీ అంతర్యానికవగులు కనిపిస్తాయి—నీ ప్రశ్నకు జవాబు దొరుకుతుంది. ఇదో చక్కని అవకాశం!—అంటోంది మనస్సు—వరలక్ష్మి మనస్తత్వాన్ని పరిశీలించిన మీదటే అప్పారావు విషయం ఆలోచించాలని నిశ్చయించుకున్నాను.

ఒక్కనిమిషంలో యీ నిశ్చయానికవచ్చి. ''... నేను మాట్లాడలేను కాని, పొద్దుపోయింది— ఇక నీవింటికి వెళ్లు—''అన్నాను. వరలక్ష్మికి ధైర్యం చెప్పి వెళ్ళిపోయాడు రామయ్య.

''కూర్చో వరలక్ష్మీ!''

''ధర్మాత్ముడు బాబూ!—నా పసుపు కుంకుమ నిల్పండి. ఆయన్ని కాపాడండి. నా సర్వంతో చెప్పులు కుట్టిస్తాను—మీకు జీవితాంతం ఋణపడివుంటాను. మా బ్రతుకులు మీ చేతిలో వున్నాయి—'' ఆమె చేతులు జోడించి గద్గదకంఠంతో ప్రార్థిస్తుంటే నాకళ్లు చెమర్చాయి. అందం, గుణం, అన్నీవుండి తనపేరు సార్థకం చేసుకుంటున్న అమృత హృదయంగల భార్యను యింట్లో పెట్టుకొని—చిత్తచాంచల్యానికి లోనయి అధమస్థితికి వచ్చిన అప్పారావుమీద విపరీతమైన కోపం వచ్చింది నాకు.

''చేసిన పాపానికి ఫలం అనుభవిస్తున్నాడు దానికి నువ్వు బాధపడి ఏం చెయ్యగలవు?—''

''లేదు బాబూ! ఆయనీ పనిచెయ్యలేదు' అంత రాక్షసకృత్యం ఆయన చేయలేరు. ఎన్నో ఏళ్ళనుంచి మీకు తెలిసిన మనిషి యీపని చేస్తాడని మీరనుకోగలరా?—''

''నేనూహించని పెన్నో చేసాడు' పేకాట, చెడుతిరుగుళ్ళు— వీటికి లొంగిపోతాడని ఎప్పుడయినా అనుకున్నానా? ఇప్పుడిదీ అంతే!''

''చేయనితప్పుకి శిక్ష పడటం అన్యాయం కదా బాబూ!''

''మరి చేసిన తప్పుల మాటేమిటి? ఇళ్ళు ఒళ్ళుగుల్ల చేసుకోవటం, వాడే సర్వస్వం అని నమ్ముకున్న నిన్ను ఉసురుపెట్టటం—వీటికి శిక్ష పడనక్కర్లేదా? అటువంటి వాడిమీద జాలి పడతావెందుకు? వాడి ఖర్మ వాడు భవించనీ!—''

''ఎంతయినా ఆయన నాకు భర్త! ఆయన తోటే నా జీవితం — ఆయన క్షేమమే నా క్షేమం—మీ మంచి మనస్సు మీరు జరిగే అన్యాయంనుంచి రక్షించగలదు. మీరే మమ్మల్ని గట్టెక్కిస్తారని నా మనస్సు గట్టిగా చెప్తోంది. మాయింటి దీపాన్ని వెలిగించండి బాబూ!—''

అక్కయ్య — విమల — వరలక్ష్మి! ఎవరు చెప్పినా ఇదేమాట! ఒకేసత్యం! ఇంత బలహీనులా యీ ఆడవాళ్లు?—కాదు, ఏదో ఉద్ధతి యీ స్త్రీ అంతర్యంలోనే వుంది. ఆదేమిటో తెలుసుకోవాలి! నా ఉద్వేగాన్ని అణచుకున్నాను.

''ఈ న్యాయస్థానాలకు చెవులుతప్ప కళ్ళు లేవు. కాంతందగ్గరకు ఎప్పటిలా డబ్బుతీసుకుందామనే వెళ్ళినా— ఖూనీ జరిగిన స్థలంలో వీడు పోలీసులకి చేతకత్తితో దొరికిపోయాడు. ఇంక నిజాన్నెవరు నమ్ముతారు?'' అన్నాను ఆమె కళ్ళల్లోకి చూస్తూ.

''మీరు తల్చుకుంటే ఏదో ఒకమార్గం దొరక్కపోదు బాబూ!'' ఏమిటో ఆమెకు నాపై అంత మూర్ఖవిశ్వాసం!

''నేననేది—యీ కేసులో చాల ఖర్చుపెట్టవల్సి వుంటుందని!''

''ఎంతవుతుంది బాబూ?'' ఆ ప్రశ్నలో ఎంతో ఆశ, ఆతురత!...

''ఏమో! ఇప్పుడెలా చెప్పగలను? ఐదారు వందలకి పైమాటే—అప్పటికీ మీఅదృష్టమెట్లా వుంటే అట్లా జరుగుతుంది.''

వరలక్ష్మి నిరాశాదుఃఖాలతో—గాలివానలో అరటిఆకు లా వణికిపోయింది.'' అంతడబ్బు ఎక్కడినుంచి తేగలను? ఆ మిగను—యింట్లోది సర్వసం అమ్మినా పట్టుమని మూడొందలు కూడరావు ఈ తాళిబొట్టు అమ్మినా నా పసుపు కుంకుమలు దక్కేట్టులేవు. బాబూ! ఈ దీనురాలిమీద కనికరించండి— అన్నీ అమ్మి తేగలిగినంత తెస్తాను. మీచేతుల్లోనే వుంది నా బ్రతుకు—'' అంటూ నా కాళ్లమీద వాలిపోయింది వరలక్ష్మి నా కొడలు గగుర్పొడిచింది.

ఆమె భుజాలు పట్టుకొని లేవదీస్తూ ''అయితే, వాడు బయటపడ్డానికి నీవేం చేయటానికయినా సిద్ధంగా వున్నావన్నమాట!'' అన్నాను.

ఆమె కన్నులలోని ఆశాద్యుతి నాకు వింత గొల్పింది. ''అవును బాబూ! అందుకు నా ప్రాణాలయినా యిస్తాను. జీవితాంతం మీ యింట సేవ చేయటానికయినా నేను సిద్ధమే! ఏం చేయమంటారో చెప్పండి?''

మనస్సు వెనకాడుతున్నా ఆత్మవంచన చేసుకోవటం లేనన్న ధైర్యం నాలక్ష్యసాధనకు తోడ్పడింది. ''వాడు బయటపడటానికి నేను సర్వప్రయత్నాలు చేస్తాను. అందులో నేను విజయం సంపాదిస్తే నేను కోరినది యివ్వటానికి నీవు సిద్ధంగా వుంటావా?''

"నాశక్తికి మించని దేనయినా సరే మీ కర్పిస్తాను బాబూ! ఆయన బ్రతికి బయటపడ టంకంటె నాకింకేమీ అక్కర్లేదీ జీవితంలో."

"మాట తప్పవుగా!"

"నా యింటి దీపం వెలిగించే చేతినే తిరస్కరించే కృతఘ్నురాల ననుకుంటున్నారా బాబూ!" ఆమె మాటల్లో సౌశీల్యం, త్యాగగుణం- ఆమె వ్యక్తిత్వంలో సంస్కారం, ఆత్మౌన్నత్యం-వెలలేని ఆభరణాలు!

"అయితే, నువ్వే కావాలి సాక్షు"

ఆమె ఉలిక్కిపడినట్లయింది. 'ఏమిటి మీరనేది?-' ఆ కంఠంలో భయం, వణుకు- ఆమె అందమైన కళ్ళ అశ్రుధారలలో కంపించి పోతున్నాయి.

"అవును. నాకు కావల్సింది నీ అంగీకారం-" ఎంతో కష్టంమీద నానోటివెంట ఆమాటలు వెలువడ్డాయి.

"బాబూ! అసహాయురాలనని మలకన చేస్తున్నారా? అడగరానిది కోరుతున్నారా? అయ్యో! నా బ్రతుకెంత నవ్వులపాలయి పోయింది—" అని కుప్పగా కూలిపోయి దుఃఖించసాగింది ఆమె.

"హో లక్ష్మీ! అందుకని నీకన్నీ ముందే చెప్పాను. నీభర్త గురించి నీవేది చేయటానికయినా సిద్ధంకావచ్చునేమో కాని, లోకంలో అంతా ఏదో చేయాలనుకోవటం నీ తెలివి తక్కువ-'

అప్పటికామె పూర్తిగా దిగజారిపోయింది. 'నిజంబాబూ! ఆయనకోసం నేనేమయినా చెయ్యటంలో సబబు- అర్థంవున్నాయి. మీరేదో చెయ్యాలనుకోవటం నా తెలివితక్కువే! ఆయన లేకపోయాక యీ జీవితం ఉన్నా పోయినా ఒక్కటే!- మీమాటే కానివ్వండి గిరిబాబూ!' అని తలదించుకుంది ఆమె.

నే శ్రగతిభుడినయ్యాను! మాంగళ్యంకోసం శీలాన్నే బలిపెడుతుందా? ఏమిటీ స్త్రీ అంతర్యంలోని ఇంత భయానకశక్తి? నా గుండెలో క్షణంపాటు దడదడలాడాయి. తెలిసీ తెలియని జవాబు ఏదో మనస్సుని సమాధానపర్చబోతోంది-

వరలక్ష్మి స్త్రీ అంతార్యాన్ని ఎంతో ఎత్తుకి తీసుకుపోయింది. ఆ ఆస్తికత ఎంత వరకు సత్యమో ఆమె భవిష్యత్తే నిర్ణయిస్తుంది. అదే నిశ్చయంతో, 'నీ త్యాగగుణం కోసమయినా న్యాయంకోసం పోరాడక తప్పదు. నీ విక వెళ్ళిరా వరలక్ష్మీ!-' అన్నాను.

సిగ్గుతో కుంచించుకుపోయి ఆమె అడుగులో అడుగువేసుకుంటూ వెళ్ళిపోతుంటే ఓ సత్యాన్వేషణకోసం ఆమెను నొప్పించటం అన్యాయమని నా హృదయం ఘోషించసాగింది. ఆఖరి కందుకోసమయినా యీ కేసులో ఎంత ఖర్చయినాసరే అప్పారావును కాపాడాలన్న నిశ్చయానికి వచ్చాను.

ఆరాత్రి ఏదో రిలీఫ్ ఫీ లయ్యాను!

◆ ◆ ◆

అంతవరకు చెప్పి ఓ క్షణం ఆగాడు జస్టిస్ గిరిబాబు-

అంతే వూపిరి బిగపట్టి వింటున్నాము. మాగుండెలదప్పుడు మాకే వినపడులోంది.

'అప్పారావుని మీరు కాపాడారా?-' ఉండబట్టలేక మావాసు అడిగేసాడు.

గిరిబాబు గంభీరంగా నవ్వాడు. ఆయన ఫాలభాగంపై అనుభవాలగీతాలు ఎన్నో కథలు చెప్తాయి. 'ఆ! అప్పారావు మృత్యువాత నుంచి తప్పించుకున్నాడు. ఎట్లా?- అంటే అది నా ప్రభావం అనను. వాడి అదృష్టమనటం కూడ తక్కువే- ఆమె త్యాగగుణమే భర్తను రక్షించుకుంది. వరలక్ష్మి స్త్రీ అంతర్యానికి ఓ క్రొత్త అర్థాన్ని నిర్వచించింది. ఆ అత్యద్భుత సత్యాన్వేషణకోసమే నేనా కేసు తీసుకున్నాను. మనసుంటే మార్గముండకపోదన్న ఆమె అమోఘవాక్కు నగ్న సత్యం!— తర్వాత ఎట్లా అప్పారావు నిర్దోషి అని కోర్టులో నిరూపించానో— అదంతా యిప్పుడో కలలావుంటుంది. ఆ సత్యాన్వేషణపై పట్టుదలే నా శక్తిని ప్రసాదించి వుండాలి-నీతితప్పిన భార్యనుచంపి, ఆమె సేరనున్న ఆస్తినంతనూ చేపట్టుకోవటం కోసం నాయుడు చేసిన పనే అది. అందరిలాగే అతనూ కొన్ని పొరపాట్లు చేసాడు. పట్టుబడిపోయాడు — ఏమయితేనేం—జీవితంలో మొదటిసారి చేపట్టిన ఖూనీకేసులో విజయం సాధించినందుకు అందరి ప్రశంసలు అందుకున్న దానికంటె, ఓ స్త్రీ త్యాగనిరతికి విలువనివ్వగలిగిన తృప్తి నా కెక్కువ ఆనందం కల్గించింది—

'ఎన్నో సంవత్సరాలుగా అపరిష్కృతమైన సమస్య మబ్బులా విడిపోయింది. ఆ ఖూనీ జరగకపోతే వరలక్ష్మితో పరిచయం కలిగివుండేదీకాదు - నాలో శోధించిన ఆ ప్రశ్నకు జవాబు దొరికివుండేదీ కాదు. ఇదే నేమో వేదు నిజం అంటే!...'

మా సంశయాలింకా ఊపిరి తీసుకోనిచ్చాయి కావు.

'వరలక్ష్మి మీ కిచ్చిన మాట!...' ఆ తర్వాత ఏమడగాలో తెలియక నసిగాడు శీను.

మరోసారి గంభీరంగా నవ్వారాయన, 'యౌవనంలో జీవితమై తెలిసీ తెలియని విలువలు పెంచుకుంటున్న తరుణంలో మీలాగే నేనూ సందేహప్రాణిగా వుండేవాడిని శీనూ! అవిద్యావంతురాలయినా ఆమె జన్మసంస్కారం వెలలేని మణిపూస. అటువంటి ఆత్మౌన్నత్యం కల స్త్రీలు మన సమాజంలో ఎందరో వున్నారు. కాని, వారిని అర్థంచేసుకోలేక మనమే ఎన్నో పొరపాట్లు చేస్తుంటాము. అమూల్య రత్నాల్ని గ్రుడ్డిగా చేజారవిడుస్తుంటాము... సమానత్వమంటూ నినాదాలు జరిపే స్త్రీలు తన ఆత్మౌన్నత్యంతో పురుషుని క్షమించి ఆరాధించిన స్త్రీ ముందు నిలబడటానికి కూడ అర్హులుకారు. అందుకు వరలక్ష్మి ప్రత్యక్ష నిదర్శనం...'

ఓ క్షణం ఆగారు గిరిబాబు.

'నా అన్వేషణలో ఆమె నొక సాధనంగా ఉపయోగించుకున్నానేకాని ఏ దురుద్దేశ్యంతోను నే నామెనా కోరిక కోరలేదు. ఆ కేసులో విజయం ఆమె అదృష్టంవల్లనని ఆనందించి ఆ తృప్తిలో తక్కినదంతా మర్చేపోయాను. ఈ విషయమే విపులంగా చెప్పటానికి రామంగారింటికి వెళ్ళాను. ఆనాటి విమల వాదనకు నేటి వరలక్ష్మి ప్రత్యక్ష సాక్ష్యమని అంగీకరించాను. నేను సత్యానికి దగ్గరయినందుకు విమల ఎంతో ఆనందించింది, అక్కయ్య, విమల, వరలక్ష్మి... స్త్రీ ఆత్మౌన్నత్యానికి ప్రతినిధులుగా నా దృష్టిలో

నొందితేసరికి ఆనంద పారవశ్యాలతో నా ఒడలు గగుర్పొడిచింది... హుషారుగా యింటికి చేరేసరికి గుమ్మంలో అప్పారావు ప్రత్యక్ష మయ్యాడు...

'నేను నవ్వుతూ పలకరించాను. తనకు పునర్జన్మ ప్రసాదించానంటూ కన్నీళ్ళతో తన గోడు వెళ్ళబోసుకున్నాడు. జీవితాంతం సేవ చేస్తాడట! ఏమిటో నవ్వుకున్నాను... నా మనసులోని మాటనే నాన్నగారన్నారు. 'ఇప్పటికయినా తెలివిగా నీ బ్రతుకు నీవు బ్రతికితే మాకేం అక్కర్లేదురా! ఆ పిల్ల మనసు మంచిది కాబట్టి, దాని తాళిబొట్టు గట్టిది కాబట్టి బ్రతికి బయటపడ్డావు. దాన్ని పువ్వుల్లోపెట్టి పూజించినా నీ పాపం క్షయం కాదు... ఇకనుంచయినా అన్యోన్యంగా వుండండి...' వాడి పొగడ్తలకి నాకు విసుగని పించి మేడమీదికి వెళ్ళిపోయాను ... వా డిప్పుడు పశ్చాత్తాప పడుతున్నాడు ... ఆ తృప్తే చాలు నాకు...

'సరిగ్గా నెల క్రితం ఆట్లాగే వాలుకుర్చీలో వెన్నెలలో స్నానం చేస్తున్నాను. అప్పటి నా బరువైన భావాలు వేరు... యిప్పటి నిర్మల భావాలు వేరు. ఏదో ఒకరోజున అక్కయ్య నిరీక్షణ ఫలిస్తుంది... అటువంటి స్త్రీ లెప్పుడో కాని ఓడిపోరు. వారి ఆత్మస్థైర్యమే వారికి కవచం వంటిది ఏవేవో ఊహలలో తేలిపోతున్న నేను 'బాబూ...' అన్న గొంతువిని ఉలిక్కిపడ్డాను. నా కన్నుల్ని నేనే నమ్మలేకపోయాను. ఆమె వరలక్ష్మి!'

మా గుండెల్లో గుబగుబలు మాముఖాల్లో కనిపిస్తున్నాయో ఏమో! గిరిబాబు చిన్నగా నవ్వాడు. మా ఆసక్తి యినుమడించింది—

'నవ్వా! మీ ఆయన ఇంతకుముందే వచ్చి వెళ్ళాడు.'

'తెలుసు బాబూ! మీరు చేసిన యీ ఉపకృతికి నా మనసెంత ఉప్పొంగి పోతుందో—మీకు కృతజ్ఞత ఎట్లా చెప్పాలో తెలియటం లేదు, ఈ అభాగ్యురాలి పసుపు కుంకుమ నిలపడానికి మరెవరయినా ప్రయత్నించారా బాబూ! మీ ఋణం ఎన్ని జన్మలెత్తినా తీర్చుకోగలనా? ఈ సమయంలో మీకిచ్చినమాట నెరవేర్చుకోవటంకన్న నా కానంద మేముంటుంది?—' ఆమె ఆఖరిమాట కులిక్కిపడ్డాను. ఆ త్యాగమూర్తికి నాహృదయం జోహారు లర్పించింది. నా అంతర్యం నన్ను హెచ్చరించింది.

'నీమంచి మనసే నీ భర్తను కాపాడింది వరలక్ష్మి! ఇందులో నేను చేసిందేమీలేదు. ఆ మాటలన్నీ మర్చిపో! మీరు క్షేమంగా సౌఖ్యంగావుంటే అంతే చాలు—'

'లేదుబాబూ!—ఈ సమయంలో నేనింకేమీ చెప్పలేను. నన్ను కృతఘ్నురాల్నిగా చేయకండి' ఆమె ఎందుకో ఆవేశపడుతోంది. ఆమె శరీరం వణకటం నా కాశ్చర్యం కల్గించింది.

'పిచ్చిదానిలా వున్నావే! ఆనాడేదో మాట వరసకన్నాను కాని నిన్న చేసిన మంచిపనిని యీనాటి పాపంతో రూపుమాపుకోమంటావా? అదంతా మర్చిపో—'

'వీల్లేదు బాబూ!— ఈ ప్రాణాలు నిలిచి వున్నప్పుడే నామాట దక్కించుకో నివ్వండి..' అని ఓ అడుగు ముందుకువేసి కుప్పగా కూలి పోయింది. నా గుండెలు దడదడలాడాయి.

ఒక్క ఉదటున లేచి ఆమెను చేతులతో పట్టుకొని, '—ఏమిటిది వరలక్ష్మి!' అన్నాను అయోమయంగా. ఆమె పాలిపోయిన ముఖంపై చిరుచెమటలు — పొడారిపోయి వణికే పెదవులు, ఆమె ఎందుకో సొలికలు తిరిగిపోతోంది'—అంతా అయిపోయింది బాబూ! మీరుచేసిన ఉపకారానికి నేనేది చేసినా సరిపోదు. మీకిచ్చినమాట దక్కించుకుందామనే వచ్చాను—కాని—కాని, బ్రతికేధైర్యం లేకపోయింది నాకు—మీమీద పగదీర్చుకోవాలని నేను ప్రాణాలు తీసుకోవటంలేదు—'

నాగుండె ఝల్లుమంది. 'ఎంతపనిచేసావు వరలక్ష్మి! నేనంత రాక్షసుడిననుకున్నావా?..' నాకేంచేయాలో తోచలేదు. మతిపోయినట్లయింది.

ఆమె ముఖకవళికలు మారిపోతున్నాయి, 'నన్ను క్షమించండి!—'

'ఏమిటి చేసావు చెప్పు! నిన్ను చావనివ్వను. నన్ను హంతకునిగాచేయకు వరలక్ష్మి!' నిజంగానే నాకేదో తెలియని భయం కల్గింది. కంఠం బొంగురు పోయింది.

'చాలసేపయింది బాబూ! ఇప్పుడిక ఎవ్వరూ చేయగల్గిందేమీలేదు—నాచావుతో మీకేమీ సంబంధంలేదని పోలీసులకిచెప్తాను... త్వరగా పిలిపించండి బాబూ! — అబ్బా! గొంతు ఎండిపోతోంది. గుండెలు బరువెక్కుతున్నాయి. త్వరగా వెళ్ళండి బాబూ!—'

నా గుండెల నెవరో పిసిగివేస్తున్నట్లయింది, లేదు—నా మూలంగా ఆమె చావకూడదు! ఆమె నెట్లాగయినా బ్రతికించుకోవాలి—నాహృదయ నైర్మల్యాన్ని ప్రపంచానికి చాటుకోవాలి—అదే ఆవేశంతో ఆమెను రెండుచేతులతో ఎత్తుకొని క్రిందకు పరిగెత్తాను. అప్పుడా బలమెట్లావచ్చిందో యిప్పటికీ ఆశ్చర్యంగానే వుంటుంది నాకు.

అమ్మకి, నాన్నగారికి ఆ విషయంచెప్పి భయపెట్టటం నాకిష్టంలేదు. అప్పటికే వరలక్ష్మి స్పృహ కోల్పోయింది. ఆమెకేదో స్మారకం తప్పిందని వాళ్ళతోచెప్పి డాక్టరు కోసం పిచ్చివానిలా బట్టలయినా మార్చుకోకుండా పరుగుదీసాను—నేను డాక్టరుతో తిరిగిరావటం కొన్ని నిమిషాలలో జరిగినా అవే నాకు కొన్నేళ్లు. ఆమెను కాపాడటం కోసం నా సర్వస్వం అర్పించటానికి సిద్ధంగా వున్నాను. ఆమె బాధ చూడలేక పొంగివచ్చే దుఃఖంతో మేడమీదకు పరిగెత్తాను. పక్కమీదపడి చంటిపిల్లవానికంటె కనికష్టంగా విలపించాను.'

'అప్పటి నా బాధని, తుఫానులో కలగిపోయిన మనస్సుని — విప్పిచెప్పాలంటే యిన్నేళ్ళతర్వాత సాధ్యంకాదు...' అని గిరిబాబు గాఢంగా నిట్టూర్చాడు.

'వరలక్ష్మి బ్రతికిందా?—' మా అందరి ఆత్రుత వాసుగొంతులో ప్రతిధ్వనించింది.

'లేదు—ఆజ్యోతి అప్పుడే ఆరిపోయింది. ఈనాడు అంతా 'న్యాయమూర్తి' అని అంటుంటే నా నీడనుచూడి నేను భయపడేలా చేసిపోయింది. ఆ భయంకరమైన త్యాగాన్ని భరించలేకపోయాను. నా పరిశోధన ఆమె ప్రాణాల్ని బలిగొన్నట్లవలేదూ? ఈ భ్రూణహత్యకు శిక్షేమిటి? న్యాయశాస్త్రంలో కనిపిం

చని యీ అన్యాయానికి నిష్కృతి ఏమిటి?... ఆమె మరణంలో నాబాధ్యత ఎంతో నాకంతు పట్టలేదు. క్షణికమయిన బలహీనతకు లోనయిన వరలక్ష్మి తన విజ్ఞానంవల్ల నా మాటల్లోని అంతరార్థం తెలుసుకోలేక ప్రాణంతీసుకుందని దానికి నేనెంతమాత్రం బాధ్యుడిని కానని విమల, రామం ఎంతో వాదించారు. అదీగాక అంతవరకు నేననుకుంటున్నట్లు విషంవల్ల కాదని— ఆమె గుండెజబ్బువల్ల మరణించిందని డాక్టరు చెప్పాడు. ఏమో!— నేనంత దారుణమైన వాగ్దానం తీసుకోనివుండకపోతే—మరి కొన్నాళ్ళామె బ్రతికివుండేదేమో! ఎంత సర్ది చెప్పుకున్నా నా అన్వేషణ ఓ నిండుప్రాణాన్ని అందులో ఔన్నత్యపు టంచులందుకున్న స్త్రీమూర్తిన్ని బలిగొన్న దనిపిస్తూనే వుంటుంది. ఈ పాపానికి నిష్కృతి కన్పించటం లేదు. కొన్నేళ్ళుగా హృదయంలో రేగుతున్న అగ్నిని—యీ కాలక్షేపంలో మీముందు బయటపెట్టుకోవటం జరిగింది. వరలక్ష్మిని సాధనంగా ఉపయోగించుకొని తెల్సుకున్న సత్యం తర్వాత మా అక్కయ్య నిరీక్షణ ఫలించటంలో నిరూపించబడినా—— అప్పుడు ఇప్పుడు—నాలో యీ సంతృప్తి మాత్రం మిగిలిపోయింది.' అని ముగించాడు జస్టిస్ గిరిబాబు.

బరువెక్కిన మాగుండెలు గాఢంగా నిట్టూర్చాయి. రకరకాల ప్రశ్నలెన్నో ఉదయిస్తున్నాయి మాలో.—

ఇంటలో లోపలకడుగుపెట్టిన ఓ నడివయసు వ్యక్తి, '. . . మళ్ళీ ఆగాథ గుర్తు తెచ్చుకొని నీవు బాధపడి యీ కుర్రాళ్ళని బాధపెట్టక పోలేకన్న బ్బులో వున్నందుకు ఏ పేకాటో ఆడకూడదప్రా!—' అన్నాడు చిన్నగా నవ్వుతూ.

'ఆబాధ ఓనాటికి తీరేదికాదుగదా! ... అదిసరే, యీయనేనోయ్ డివిజనల్ ఇంజనీరు, నామిత్రుడు అయిన రామంగారు—' అని గిరిబాబు ఆయన్ని మాకు పరిచయం చేసారు.

రామం అన్నాడు నవ్వుతూనే— '.. ఇన్నాళ్లకు మళ్లీ ఆనాటి సంఘటన గుర్తుకుచేసావు. నీకు తెలియని దింకొకటుందిసుమా! కంగారు పడనంటే చెప్తాను—'

గిరిబాబుతోపాటు మేమూ చకితుల మయ్యాము 'అనుభవాల్ని జీర్ణించుకున్నాక కంగారెందుకు— చెప్పదేమిటో!...' అన్నాడు గిరిబాబు మార్దవంగా నవ్వటానికి ప్రయత్నిస్తూ.

'ఆనాడు నీబాధ చూడలేక విమల, నేను కల్సి ఆలోచించి డాక్టరుచేత అబద్ధం చెప్పించాము. లక్ష్మి గుండె జబ్బుచేత మరణించలేదు—' అని ఇంకా ఆయనేదో అనబోతుంటే, 'నిజంగానా!—' అని నోరుతెరిచి— 'అబ్బా!' అని గుండెలు పట్టుకొని కుర్చీలో వెనక్కి వాలిపోయాడు జస్టిస్ గిరిబాబు.

అంతా షాక్ తిన్నట్లయ్యాము. వాసు వెంటనే హాస్పటల్ కు ఫోన్ చేసాడు. కొన్నేళ్ళ నాటి సంఘటన ప్రభావం ఆయనపై ఇంకా పనిచేస్తూండటం మాకాశ్చర్యం కల్గించింది.

'ఇంకెక్కడి గిరిబాబు?— ఇన్నాళ్లు యీ నిజాన్ని కడుపులో దాచినది యీనాడు నిన్ను చంపటానికేనా గిరీ!—' రామం గొంతులో దుఃఖోద్వేగాలు పొంగుతున్నాయి.

ఈహఠాత్సంఘటనకి మేమంతా భయంతో కంపించిపోయాము—

ఆక్షణంలో నా కన్పించింది అకస్మాత్తుగా.. గిరిబాబు నిరీక్షించిన నిష్కృతి ఇదే కాదు కదా అని . . .

---

# యుద్ధం!

(12 వ పేజి తరువాయి)

చల్లని రంగుల చిత్రాలు ఎక్కువగా వేస్తూంటానని చెప్పి నన్ను చంద్రుణ్ణని పొగిడేవాడివికదూ. చంద్రు డిప్పుడు కృష్ణపక్షంలో పడ్డాడు అమావాశ్య దగ్గిరపడింది. అన్నాడు నవ్వుతూ సూరి.

'నిన్ను చంద్రుడనడం పొగడ్త కాదు. స్వయంవ్యక్తిత్వంతో ప్రకాశించలేకపోతున్నావనే హేళన.'

(నాకు గొప్ప దుఃఖం కలిగినపుడు ఎదుటి వ్యక్తిని అసత్యం చెప్పి అయినా గాయపరచందే ఉండలేక పోవడం నాతత్వం )

'అదుగో అప్పుడే మనమధ్య వైర వాతావరణం నిండిపోతోంది. ఇంత మంచి స్నేహితులం మనం. మన సమావేశాలు మటుకు విరోధులు కలుసుకున్నట్టే ముగుస్తాంటాయేం రంగా?'

'మన వ్యక్తిత్వాలూ స్నేహం, ముఖస్తుతులతో లాంఛనాలతో పనిలేనంత ఎదిగిపోయాయి సూరీ.'

మామధ్య నెలకొన్న ఆనందంతో ఇద్దరం సింహావలోకనంలో పడ్డాం.

కొన్ని క్షణాలు గడిచాక 'మనం ఆఖరిసారి ఎక్కడ గడిపామో జ్ఞాపకం ఉందా రంగా?' అనడిగాడు అతని రెప్పలు స్మృతుల బరువుతో మూసుకుని ఉన్నాయి.

ఆపూట మరిచిపోగలనా? ఆ లోయలో ఇంకా పొద్దున్నప్పటికీ చలి పేరుకుంటున్న— వర్ణించకుమరి. వెచ్చని బంగారు ఎండ కాస్తున్న ఆ కొండ కొమ్ముల్ని చూసి నువ్వూ నేనూ అసూయపడ్డాం కదూ?

అవును ఆనందం అసూయగా వ్యక్తం కావడం మనిషిలోని అల్పత్వాన్ని చాటుతుంది.

సూరి నవ్వాడు ఇంకా మనస్తత్వాల వెర్రిపోతే దన్నమాట. నిజ్జీ నిన్ను ప్రేమిస్తాం దని నా వూహ.

'అబద్ధం' అన్నాను గట్టిగా (అనవసరం)

ఏమో నీకే తెలియాలిమరి! అదిః ఇంకా తాగుతున్నావా?

'ఇంకానా? అంటే రోజూ తాగుతున్నాననా? ఎప్పుడైనా ఒక ప్రయోజనాన్ని ఆశించి తాగుతానంతే. నువ్వు? ఆ రోజు లోయలో నాతోబాటు మొదటిబుడ్డి పుచ్చుకున్నావుగదూ?'

. 'అవును అదే ఆఖరిబుడ్డికూడా మళ్ళీ తాగలేదు.'

. 'మంచిపని చేశావు. ఆవేళ నువ్వు అనుభవంకోసం తాగుతున్నావనీ, కేవలం అనుభవం కోసం చేసే ఏపనివల్లా నువ్వు ఆనందాన్ని పొందలేవనీ కదూ అన్నాను నేను?'

'అవును. అప్పటికే నా కాయ సగం దాకా ఖాళీ అయింది. దాంతో నాకు ధైర్యం వొచ్చింది. కల్లు తాగడం, సిగరెట్లు కాల్చడం, ఆఖరికి అన్నం తినడం— ప్రతీదీ అనుభవం కోసమే చెయ్యడం మీ రచయితల దగ్గిరే నేర్చుకోవాలనేశాను రంగా ఆ వేడిలో'